క్లుప్తంగా

28న ఆర్టీసీ రీజియన్ బహిరంగ వేలం

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక పార్సిల్ ఆఫీస్‌లో అన్‌క్లెయిమడ్, అన్ ఐడెంటిఫైడ్ పార్సిళ్లకు ఈ నెల 28వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (కమర్షియల్) మాధవ్ మంగళవారం తెలిపారు. ఈ బహిరంగ వేలం శుక్రవారం ఉదయం 10.30 గంటలకు రాజమహేంద్రవరం బస్టాండ్‌లోని పార్సిల్ ఆఫీస్ వద్ద నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న ప్రజలు పాల్గొనవచ్చన్నారు.

సైన్స్ పరిశోధనపై గెస్ట్ లెక్చర్

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో సైన్స్ పరిశోధనపై మంగళవారం గెస్ట్ లెక్చర్ నిర్వహించారు. మెటీరియల్ సైన్స్ పరిశోధన, ఇటీవల పోకడలు, ప్రాముఖ్యత, అవసరాలు అనే అంశంపై హైదరాబాద్‌కు చెందిన చైతన్య భారతి ఇనిస్టూట్ ఆఫ్ టెక్నాలజీ ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ షణ్ముఖ సమతం గెస్ట్ లెక్చర్ నిర్వహించారు. జీవితంలో సైన్స్ ప్రాముఖ్యతను యూజీ, పీజీ విద్యార్థులకు వివరించారు. నానో టెక్నాలజీ, స్మార్ట్, బయో మెటీరియల్స్, కంప్యూటేషన్, ఎనర్జీ మెటీరియల్స్, స్పింట్రోనిక్స్, స్పైరిమియన్‌ల ఫలితాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్ కోమలిలక్ష్మి, డాక్టర్ ఈసూబ్‌బాషా, డాక్టర్ బి.గౌరీనాయుడు, కె.వెంకటేశ్వరరావు, ఫిజిక్స్ అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి

కంబాలచెరువు: ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే ఏడో తరగతి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ కోరింది. ఈ మేరకు మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వై.భాస్కర్ మాట్లాడుతూ ఏడో తరగతి విద్యార్థులకు తొందరగా పాఠ్య పుస్తకాలను అందించాలని, కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో నోట్ పుస్తకాలు అమ్మడం అరికట్టాలన్నారు. నోట్ పుస్తకాల పేరుతో వేల ఫీజులు దోపిడీ చేస్తున్నారని, పుస్తకాలు అమ్మే స్కూల్స్ అనుమతులు రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వి.రాంబాబు, జిల్లా సహాయక కార్యదర్శి కె.జ్యోతి, జిల్లా కమిటీ సభ్యులు నిశ్చల్ పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో సమస్యలు పరిష్కరిస్తాం


ప్రభుత్వాసుపత్రిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

కంబాలచెరువు: రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. ప్రభుత్వాసుపత్రిని ఆయన మంగళవారం పరిశీలించారు. ఆసుపత్రి వార్డుల్లో పర్యటించారు. రోగులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో సమస్యలను ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. ఆయన వెంట ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ సూర్యప్రభ, డిప్యూటీ సూపరింటెండెంట్ రాజు, ఆర్ఎమ్‌వో ప్రణవ్, టీడీపీ నాయకులు ఉన్నారు.

సూర్యదేవుని గ్రామోత్సవం

గోకవరం: మండలంలోని గోపాలపురం గ్రామంలో సనాతన ధర్మ ప్రభోధనా స్వచ్ఛంద సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఉషా పద్మినీ ఛాయా సమేత సూర్యనారాయణస్వామి గ్రామోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని వీధుల్లో ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఈ సందర్భంగా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తోట సాయిబాబు, ఉపాధ్యక్షుడు అక్షింతల రాజా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సూర్యనమస్కారాలు ఆచరించాలన్నారు. గ్రామోత్సవంలో దోసపాటి సుబ్బారావు, పిల్లంగోరు పాపారావు, చింతల సుబ్బారావు, చింతల చిన్నకాపు, సీతయ్య, గూడవల్లి సతీష్, కాసాని ఏడుకొండలు, వీరవల్లి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుతో రైతన్నలకు మేలు

మధురపూడి: ఉద్యానవనాల సాగు రైతులకు లాభదాయకమని రుకొండ ఎంపీడీఓ వి.హేమసుందరరావు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉద్యాన, పండ్లు, పూలతోటల సాగు ద్వారా రైతులకు అధిక ఆదాయం పొందవచ్చన్నారు. ఉద్యానవనాలు మామిడి, జీడిమామిడి, సపోట, బత్తాయి, నిమ్మచ చింత, కొబ్బరి, సీతాఫలాలు, మునగ, దానిమ్మ, అంజూర, డ్రాగన్ ఫ్రూట్,జామ, తైవాన్ జామ పండ్ల తోటలను విస్తృతం చేయాలన్నారు. వీటి సాగు నిర్వాహణ ఖర్చుగా పంట రకాన్ని బట్టి రూ.80 వేల నుంచి రూ.1.20లక్షల వరకూ ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఉపాధి హామీ పథకంలో నిధులు వెచ్చిస్తారన్నారు.

పచ్చని తుప్పలు.. తప్పని తిప్పలు

- విద్యుత్ కార్యాలయాల రోడ్డులో పొంచి ఉన్న ప్రమాదం
- రోడ్డుకు ఇరువైపుల తుప్పలు
- విషసర్పాలకు నిలయంగా మారిన వైనం
- భయం గుప్పిట్లో ఉద్యోగులు


రోడ్డుకు ఒకవైపు భారీగా పెరిగిన తుప్పలు


పాతభవనాలపైకి ఎగబాకిన పచ్చని బఠాని తుప్పలు


రోడ్డుకు ఇరువైపులా పెరిగిన తుప్పలు

రాజమహేంద్రవరం రూరల్: ఆ రోడ్డుకు ఇరువైపుల పచ్చని బఠాని తుప్పలు.. రాత్రి సమయాల్లో ఎక్కడ విషసర్పాలు కాటేస్తాయోనని ఉద్యోగులు భయాందోళనకు గురువతున్నారు. ఈ రోడ్డు బొమ్మూరు వెంకటగిరికొండపై ఉన్న విద్యుత్ కార్యాలయాల సముదాయానికి వెళ్లే రహదారి. దీనికి సంబంధించిన వివరాలు ఉన్నాయి. బొమ్మూరు వెంకటగిరికొండపై విద్యుత్‌శాఖకు చెందిన జిల్లా స్టోర్స్, ఎంఆర్‌టీ, ట్రాన్స్‌ఫార్మర్స్‌రి పేర్‌తో పాటు, కాటన్ మ్యూజియం, సురక్షిత గోదావరి మంచినీటి పథకం ఉన్నాయి. ప్రతి రోజు ఉద్యోగులు వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపుల పచ్చని బఠాని తుప్పలు దర్శనమిస్తున్నాయి. అలాగే ఈ ప్రదేశంలో ఉన్న పాటుబడిన భవనాలపై సైతం బఠాని తుప్పలు ఎగబాకాయి. ఈ పచ్చని తుప్పలు చూసేవారికి ఆహ్లాదకరంగా కనిపిస్తున్నాయి. కానీ ఈ తుప్పలు విషసర్పాలుకు నిలయంగా మారింది. రాత్రి సమయాల్లో ఏ పక్క నుంచి విషసర్పాలు వచ్చి కాటేస్తాయోనని ఉద్యోగులు బెంబేలెత్తిపోతున్నారు. నిత్యం తిరిగే మార్గంలో తుప్పలును తొలగించే చర్యలు మాత్రం అధికారులు చేపట్టడం లేదు. గతంలో ఈ తుప్పల వలన విద్యుత్‌శాఖ కార్యాలయంలో అగ్ని ప్రమాదాలు జరిగిన సంఘటనలు కూడా చోటు చేసుకున్నాయి. గతంలో పాములు సైతం రోడ్డుపై పట్టపగలే కనిపించిన దాఖలాలు అనేకం. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు, ఇతర కార్యాలయంలు ఉద్యోగులు స్పందించి పచ్చని బఠాని తుప్పలు తొలగించి ఉద్యోగులకు ఎటువంటి ప్రమాదం జరగకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నైపుణ్యశిక్షణతో మహిళల ఆర్థికాభివృద్ధి

ఓఎన్‌జీసీ జీఎం గోకా చంద్రశేఖరరావు


సర్టిఫికెట్స్ అందజేస్తున్న ఓఎన్‌జీసీ జనరల్ మేనేజర్ గోకా చంద్రశేఖరరావు

రాజమహేంద్రవరం సిటీ: మహిళలు స్వయం వృద్ధి సాధించాలంటే నైపుణ్యం ఉన్న వృత్తులు ఎంతగానో ఉపయోగపడతాయని ఓఎన్‌జీసీ జనరల్ మేనేజర్ గోకాడ చంద్రశేఖరరావు అన్నారు. మంగళవారం స్థానిక లాలాచెరువులోని స్వర్ణాంధ్ర ఉచిత కుట్టు, మగ్గం వర్క్ శిక్షణా కేంద్రంలో జరిగిన 72వ బ్యాచ్ ముగింపు ఉత్సవంలో చంద్రశేఖరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖరరావు మాట్లాడుతూ మహిళలు కష్టపడి సంపాదించిన మొత్తాలు పొదుపు చేయడం వల్లే, కుటుంబాలు ఆర్థికంగా నిలబడగడుగుతున్నాయన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో భార్యాభర్తలిద్దరూ కష్టపడి సంపాదిస్తేనే కుటుంబం గౌరవంగా బ్రతికే వీలుందని అందరూ చేతి వృతులు నేర్చు కోవాలని కోరారు. ఇంటిలో ఉండే మగ్గం, కుట్టు పని ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఎక్కువగా ఉందన్నారు. స్వర్ణాంధ్ర నిర్వాహకులు రాంబాబు మాట్లాడుతూ గత 26 సంవత్సరాలుగా స్వర్ణాంధ్ర సేవా సంస్థ తరపున కంప్యూటర్, కుట్టు శిక్షణ, మగ్గం వర్క్‌లో శిక్షణ ద్వారా సుమారు 18,250 మందికి ఉచిత శిక్షణ అందించినట్లు తెలిపారు. శిక్షణలో ఉచితంగా మెటీరియల్, మధ్యాహ్న భోజనంతో పాటు శిక్షణ అనంతరం ఉచితంగా సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందిమన్నారు. నూతన బ్యాచ్ శిక్షణ ప్రారంభమైందని జూలై 30 వరకు అడ్మిషన్ జరుగుతాయని రాంబాబు తెలిపారు. ఆసక్తి ఉన్న మహిళలు స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమం ఫోన్ నంబర్ 9849847489 ద్వారా సంప్రదించాలని రాంబాబు కోరారు.

అక్రమ కట్టడాలు తొలగించండి

- అక్రమార్కులకు నగరపాలక సంస్థ అధికారుల ఆదేశం
- 'నిద్రావస్థలో నగరపాలన'పై స్పందించిన అధికారులు

సాక్షి ఇంపాక్ట్


అక్రమ కట్టడాలను పరిశీలిస్తున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: ఆక్రమణలు చేపట్టి ప్రజాధనాన్ని లూటీ చేస్తున్న వ్యవహారంపై 'నిద్రావస్థలో నగరపాలన' శీర్షికన 'సాక్షి' ప్రచురించిన కథనంపై నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగం అధికారులు స్పందించారు. మంగళవారం నగరపాలక సంస్థ మేనేజర్ శ్రీనివాస్ సంబంధిత అధికారులకు ఆక్రమణలపై దర్యాప్తు చర్యలు చేపట్టాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో నగరపాలక సంస్థ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్‌కుమార్ రాజమహేంద్రవరం నగరంలో మెయిన్ రోడ్డు శ్రీకందుకూరి వీరేశలింగం పుర మందిరం సమీపంలోని ఏసీవై రెడ్డి కాంప్లెక్స్‌ను పరిశీలించారు. అక్రమ కట్టడాలను గుర్తించారు. రెండు రోజుల్లోగా అక్రమ కట్టడాలను తొలగించాలని, లేకుంటే కఠిన చర్యలు చేపడతామని హెచ్చరికలు జారీ చేశారు. ఏసివై రెడ్డి కాంప్లెక్స్‌లో ఒక షాపు అద్దెకి తీసుకుని మూడు షాపులను ఆక్రమించడంతోపాటు కాంప్లెక్స్ పైభాగాన నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా స్టోర్ రూమ్ ఏర్పాటు చేయడంపై రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలగించిన టాయిలెట్లను తక్షణమే నిర్మాణం చేపట్టాలని ఆదేశాలిచ్చారు .

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి


మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటుతున్న రొంగల గోపీశ్రీనివాస్ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులందరూ భాగస్వాములు కావాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగలి గోపీశ్రీనివాస్ అన్నారు. మంగళవారం శాటిలైట్ సిటీ గ్రామం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మన్యం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ×ఒక చెట్టు-అమ్మ కోసం(ఏక్ పేడ్ - మా కే నామ్) కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ బీజేపీ మూలపార్టీ జనసంఘ్ వ్యవస్థాపకులు డా.శ్యామప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ అయిన ఈనెల 13 నుంచి జూలై 6 వరకు మొక్కలు నాటాలని పర్యావరణ పరిరక్షణకు అందరం కలసి ఉద్యమించాలన్నారు. తల్లిలాంటి భూమిని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవులు నాగేంద్ర, రాజమండ్రి రూరల్ అసెంబ్లీ కో-కన్వీనర్ యానాపు ఏసు, రాజమహేంద్రవరం జిల్లా ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మన్యం శ్రీనివాస్, ఓబిసి మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మట్ట నాగబాబు, ఓబీసీ మోర్చా రూరల్ ఉపాధ్యక్షుడు సుధాకరావు, బీజేపీ రూరల్ మండల కార్యవర్గ సభ్యులు మజ్జి సాయికిరణ్, పలిత సతీష్,హరి, సురేష్, జనసేన రూరల్ మండలం ప్రధాన కార్యదర్శి చౌడాడ సునీల్ కుమార్, ప్రేమ్ కుమార్‌లు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో అంటువ్యాధులు దూరం


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్

కడియం: మండలంలో డయేరియా ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కడియం ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపీడీఓ రాజ్ మనోజ్ ఆధ్వర్యంలో వర్షాకాలంలో డయేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన వెలుగుబంటి ప్రసాద్ మాట్లాడుతూ ఇంటి ఆవరణలో ఎలాంటి నీటి నిల్వలు ఉండకూడదని, వాటర్ ట్యాంకులలో ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలన్నారు. వాటర్ క్వాలిటీ టెస్టింగులు చేయాలని, దోమలు వ్యాప్తి చెందకుండా నీరు నిల్వ ఉండేచోట్ల దోమల మందులను పిచికారీ చేయాలన్నారు. చెత్త లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎం.పి.పి వెలుగుబంటి ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ ఎస్.జెస్సీ సుప్రియ, డాక్టర్ ఎం.మణిజ్యోత్స్న, ఈఓపీఆర్డీ విక్టర్ బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్, ఆరోగ్య విస్తరణాధికారి ఎంవీబీ రామకృష్ణ, గ్రామపంచాయతీ, సచివాలయ కార్యదర్శులు, శానిటరీ సూపరువైజర్లు పాల్గొన్నారు.

డయేరియాతో డేంజర్.. బీ కేర్‌ఫుల్


సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సంధ్య

నిడదవోలు: వర్షాలు మొదలైనందున డయేరియా వ్యాధి బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు వహించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సంధ్య అన్నారు. జిల్లాలోని కొన్నిచోట్ల అతిసార కేసులను గుర్తించిన నేపథ్యంలో మున్సిపల్, ఆరోగ్యశాఖల అధికారులు అప్రమత్తమయ్యారు. దీనిలో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏఎన్ఎంలు, మున్సిపల్ పారిశుధ్య సిబ్బందికి డయేరియా నివారణ, పారిశుధ్య నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సంధ్య మాట్లాడుతూ వార్డుల్లోని మురుగు నీటి కాలువలు, వీధులను శుభ్రం చేయించి, ఫినాయిల్ చల్లించాలన్నారు. కుళ్లిన, నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు తినరాదని సూచించారు. అలాగే కాచి వడపోసిన నీటినే తాగాలని, ఇంటివద్ద నీటి నిల్వలు లేకుండా చూడాలని సలహా ఇచ్చారు. మున్సిపల్ కమిషనర్ రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ మరుగు కాలువలను ఎప్పటికపుడు శుభ్రపరచాలని, తాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. తాగునీటి ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయించాలన్నారు. ప్రతి ఒక్కరూ డయేరియాపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో నెహ్రూనగర్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి ఈ. తేజశ్రీ , పట్టణ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ఉదయ్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్ జి. ప్రసాద్. ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఇంజినీరింగ్ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఆకాశం.. అరుణారుణం


సాయంత్రం 6.47 గంటల సమయంలో ...

రాజానగరం: ఆస్వాదించే మనస్సు ఉండాలేగానీ ఏ చిత్రకారుడు చిత్రీకరించని ఎన్నో అందాలను ప్రకృతి మనకు నిరంతరం చూపిస్తూనే ఉంటుంది. ముఖ్యంగా ఉదయించే సూర్యుడు ఆకాశాన్న వెలుగు పంచుతూ కనిపిస్తాడు. అలాగే సూర్యాస్తమయంలో తన కిరాణాలతో ఎన్నో రంగులు, అందాలతో మైమరపిస్తాడు. మంగళవారం రాజానగరంలో సంధ్యాసమయానా ఆకాశంలో సూర్యుడు ఎరుపు పసుపు వర్ణంలో చింతనిప్పులా దర్శనమిచ్చే దృశ్యాలే అందరినీ ఆకట్టుకున్నాయి.

వైభవంగా కన్నమ్మతల్లి జాతర


అమ్మవారి వేషధారణలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆల్కాట్‌తోట ఐదు బళ్లమార్కెట్ సెంటర్‌లో శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన కన్నమాంబ పేరంటాలు అమ్మవారి 126వ జాతర మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. అమ్మవారి చల్లఘటాలను వీధుల్లో ఊరేగించి రాత్రికి కన్నమాంబ పేరంటాలు అమ్మవారి ఆలయానికి తీసుకువచ్చి పూజలు నిర్వహించారు. జాతర సందర్భంగా అమ్మవారి వేషధారణలు, కేరళనృత్యాలు, ప్రత్యేకంగా వేసిన వెంకటేశ్వరమహాత్మ్యం, హరిశ్చంద్రఘాట్ దృశ్యాలు అందరిని ఆకట్టుకున్నారు. మిరుమిట్లు గొలిపే బాణసంచా కాల్పులు భక్తులను అలరించాయి. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి జాతరలో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. కమిటీ పెద్దలు గోరంట్లను శాలువాతో సత్కరించారు.


హరిశ్చంద్ర ఘాట్ దృశ్యం


కన్నమాంబ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి


మిరుపమిట్లు గొలుపుతున్న బాణసంచా

తస్మాత్ జాగ్రత్త!

రాజానగరం: తాళం వేసి ఉన్న ఇంటినే లక్ష్యంగా చేసుకుని చోరులు రెచ్చిపోతున్నారు. వారం రోజుల క్రితం స్థానిక వైఎస్సార్ కాలనీలో మూడు ఇళ్లలో తాళాలు బద్దలు కొట్టి, సుమారు రూ.ఆరు లక్షల విలువైన బంగారు, వెండి నగలు, కొంత నగదును అహరించుకుపోయిన సంగతి విదితమే. ఇదే తరహాలో వెలుగుబందలోని జగనన్న కాలనీలో ఒక ఇంటిలో దొంగలు పడి సుమారు ఏడు కాసుల బంగారు నగలు, కిలోన్నర వెండి వస్తువులు, రూ.20 వేలు నగదును దోచుకుపోయారు. రాజమహేంద్రవరంలోని పేదలకు గత ప్రభుత్వం పంపిణీ చేసిన ఇంటి స్థలాల్లో నిర్మించిన జగనన్న కాలనీలోని ఒక ఇంటిలో ఈ దొంగతనం జరిగింది. ఈ చోరీకి సంబంధించి బాధితురాలు బర్ల భవానీ స్థానిక పోలీసులకు మంగళవారం ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్న వివరాలిలావున్నాయి. బంధువుల ఇంటికి పొరుగూరు వెళ్లి ఉదయమే తిరిగొచ్చిన భవానీ కుటుంబ సభ్యులు ఇంటి తలుపులు తెరచివుండడం చూసి కంగారుపడ్డారు. తలుపులకు వేసిన తాళాలు పగులకొట్టివుండడంతో లోనికి వెళ్లిన వారు నివ్వెరపోయారు. సంవత్సరాలు తరబడి కష్టపడి సంపాదించుకున్న బంగారు, వెండి వస్తువులతోపాటు నగదును బీరువాలో దాచుకుంటే ఏదీ వదలకుండా దుండగులు సర్వం దోచుకుపోయారంటూ లబోదిబోమన్నారు. ఈ మేరకు రాజానగరం పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేయడంతో క్యూస్ టీమ్‌ని, వేలిముద్ర నిపుణులను రప్పించి, దుంగడుల కోసం గాలిస్తున్నారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, ఇల్లకు తాళం వేసుకుని గ్రామాంతరాలు వెళ్లేవారు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని సీఐ కాశీవిశ్వనాథ్ సూచించారు.

యోగా పోటీల విజేతలకు బహుమతులు


బహుమతులు పొందిన యోగా విజేతలతో ఎంఈవో బాలామణి తదితరులు

తాళ్లపూడి: యోగా, ధ్యాన సాధనతో విద్యార్థులు మానసిక ప్రశాంతత సాధించి చదువులో ముందంజ వేయవచ్చని ఎంఈవో సీహెచ్ బాలామణి అన్నారు. వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గాయత్రీ యోగా సమితి యోగా గురువు నక్కా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో యోగా పోటీలు నిర్వహించారు. విజేతలకు మంగళవారం ఎంఈవో చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యోగా గురువు నక్కా వెంకటేశ్వరరావు, గాయత్రీ యోగాసమితి కార్యదర్శి సత్యనారాయణ, నిర్వాహకుడు జోడాల వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు సుభాషిణి, లక్ష్మణ్‌కుమార్, రామచల్లయ్య, దుర్గాభవాని, భరత్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ జోలికి వెళితే భవిష్యత్తు చీకటే

కొవ్వూరు: మాదక ద్రవ్యాలకు (డ్రగ్స్) అలవాటు పడితే భవిష్యత్తు అంధకారం అవుతుందని, యువత మత్తు పదార్థాల జోలికి పోయి భవిష్యత్తును పాడు చేసుకోవద్దని స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో(ఎస్ఈబీ) ఇన్‌స్పెక్టర్ పి. శ్రీనివాసరావు సూచించారు. డ్రగ్స్ వాడకం వలన కలిగే అనర్థాలపై పట్టణంలోని సంస్కృత కళాశాలలోని విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి పౌరుడూ సహకరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. డ్రగ్స్ వాడకం ద్వారా కలిగే శారీరక, మానసిక, సామాజిక అనర్థాలను ఆయన విద్యార్థులకు వివరించారు. ఎక్కడైనా డ్రగ్స్ విక్రయాలు, వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిస్తే ఎస్ఈబీ అధికారులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ డి.గౌరీశంకరరావు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంక్ లావాదేవీలపై అవగాహన అవసరం

నల్లజర్ల: బ్యాంకు లావాదేవీలు, డిపాజిట్లపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దూబచర్ల శాఖ మేనేజర్ ఆర్.ఏడుకొండలు అన్నారు. బ్యాంకింగ్ లావాదేవీలు, డిపాజిట్లపై మంగళవారం దూబచర్ల గ్రామ సచివాలయం వద్ద ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్‌మేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏడుకొండలు మాట్లాడారు. బ్యాంకులు అందించే రోజువారీ సేవలతో పాటు డిపాజిట్లు, బ్యాంకింగ్ లావాదేవీలు, పొదుపు ఆవశ్యకత, రుణాలు, సెక్యూరిటీ స్కీమ్స్, వృద్ధులకు బ్యాంకు కల్పించే సౌకర్యాలు, సోషల్ సెక్యూరిటీ స్కీమ్స్, సైబర్ క్రైమ్స్ గురించి వివరించారు. కార్యక్రమంలో బ్యాంక్ క్రెడిట్ మేనేజరు జగన్మోహన సాయి, ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.ఆంజనేయులు, మేనేజరు అశోక్‌కుమార్, రీసోర్సు పర్సన్‌లు ఎస్.అనిల్, ఎస్.సుబ్బరామయ్య, కె.చందు తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

శ్యామల	:	ఓఎంజీ (ఓ మంచి ఘోస్ట్)
సూర్యమినీ	:	నింద
సూర్యప్యాలెస్	:	హరోంహర
స్వామి	:	మహారాజ
శివజ్యోతి	:	ఏ
అనుశ్రీ	:	మనమే
ఊర్వశి	:	అంతిమతీర్పు
రంభ	:	కేజీఎఫ్-1
మేనక	:	ప్రేమకథా చిత్రమ్
అప్సర	:	ప్రభుత్వ జూనియర్ కళాశాల
కుమారి	:	హనీమూన్ ఎక్స్‌ప్రెస్
నామవరం వీఎస్ మహల్	:	మహరాజ
ధవళేశ్వరం మురళీకృష్ణ	:	మహారాజ